క్లుప్తంగా

ప్రత్యేక ఆధార్ కేంద్రాలపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొయ్యలగూడెం: వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, లబ్ధి పొందాలని ఐసీడీఎస్ శాఖ పేర్కొంది. కొయ్యలగూడెంలో ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ సేవలలో అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్‌లు అంబటి సరస్వతి, నయోమీరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిజాతగిరిలో దివ్య ప్రబంధ పారాయణం


దివ్య ప్రబంధ పారాయణం చేస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. ఏలూరు పట్టణానికి చెందిన జనార్ధన స్వామి ఆలయ భక్తులు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ దేవస్థానంలో పన్నిద్దరు (12)ఆల్వార్లు రచించిన నాలాయిర దివ్య ప్రబంధ సేవా కాలం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి సౌకర్యాలు, ప్రసాదం ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు కాటన్ దొర


కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అపర భగీరథుడు ఆర్థర్ కాటన్ 125వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని పీడబ్ల్యూడీ కార్యాలయంలో కాటన్ దొర విగ్రహానికి ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కాటన్ మహాశయుని ప్రణాళికల వలన ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని నందాపురంలో బందకట్టు డ్యాం 1882వ సంవత్సరంలో నిర్మించారని, తద్వారా నాలుగు మండలాలలో నాలుగువేల ఎకరాల భూమికి సాగు నీరు అందుతుందన్నారు. ఆయనను యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పల్లపు ప్రాంతాలు పరిశీలించిన ఎంపీపీ


ముంపు ప్రాంతవాసులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలో పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీటి ప్రాంతాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు, పొడుం శ్యామ్, వార్డు సభ్యులతో కలిసి కొత్తపేట, బాపూజీ కాలనీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. నీరు మళ్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షపు నీటి వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేశారు. పుంత రోడ్లులో సర్వే చేయించి పుంత రోడ్డు సమస్యలు పరిష్కరించాలన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

చింతలపూడి: మండలంలోని మల్లాయగూడెం గ్రామంలో ఒక వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కె.వీరయ్య(63) బుధవారం నీటికుంట చెరువు సమీపంలో గేదెలు మేపుతుండగా ప్రమాద వశాత్తూ కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వీరయ్య మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

తీరని వెతలు.. వీడని వరద

- శాంతించిన గోదావరి
- నీట మునిగిన కూరగాయల పంటలు


తమ గోడును వెళ్లబోసుకుంటున్న రేపాకగొమ్ము వరద బాధితులు


వరద తగ్గుముఖం పట్టినా ఇంకా ముంపులోనే ఉన్న కూరగాయల తోట

కుక్కునూరు: వరద వదలడం లేదు, వెతలు తీరడం లేదు అన్నట్టుగా ఉంది ముంపు ప్రాంత వాసుల పరిస్థితి. ప్రతీ ఏడాది గోదావరి వరదలతో ఇబ్బందులు పడడం తమ వల్ల కాదని మాకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించి పునరావాస కాలనీలకు తరలించాలని దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఆశ్రయం పొందుతున్న వేలేరుపాడుకు చెందిన రేపాకగొమ్ము వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బాధితులు మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ కాలనీలో సమస్యలు వేధిస్తున్నాయన్నారు. అధికారులు నిత్యావసర సరుకులు ఇవ్వలేదని ఆరోపించారు. వీధి లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామస్తుల వద్దకు కలెక్టర్ వచ్చి మాట్లాడి వెళ్లారన్నారు. కాని తమ వద్దకు కనీసం తహసీల్దార్, స్థానిక అధికారులు వచ్చిన దాఖలాలు లేవన్నారు. గోదావరి వరదల్లో పునరావాస కేంద్రాలకు రావడం ఇబ్బందులు పడడం తమ వల్ల కాదని తొందరగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి తమను పునరావాస కాలనీలకు పంపించాలని వేడుకున్నారు.

పంటలను వీడని వరద

తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నాలుగు రోజులుగా గోదావరికి పెరిగిన వరద ప్రవాహం విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ సారి వరద ఏ మేరకు వస్తుందోనని ఆందోళన చెందిన విలీన మండలాల నిర్వాసితులు వరద రెండో ప్రమాద హెచ్చరిక దాటడంతో బెంబేలెత్తిపోయారు. కాని గోదారమ్మ శాంతించి బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 45 అడుగులకు చేరడంతో ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినా మండలంలో పంట చేలు ఇంకా ముంపు నీటిలోనే ఉన్నాయి. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. శాంతించిన గోదారమ్మ గ్రామాలలోని ఇళ్లను వదిలి పెట్టి పంట పొలాలను ముంచెత్తి తమకు కన్నీటిని మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వరదతో కూరగాయలు పండించే రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో సుమారుగా 245 ఎకరాల పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. వేసవిలో మండుటెండను సైతం లెక్క చేయక కూరగాయలు సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయానికి తమను నిండా ముంచిందని ఆవేదన చెందుతున్నారు. అంతేకాక పంట నష్టపోయిన రైతులకు పోలవరం పరిహారంతో సంబంధం లేకుండా నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి



కుక్కునూరులో 1.5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కూరగాయల సాగు చేశాను. తీరా పంట చేతికొచ్చి అమ్ముకునే సమయంలో గోదావరి వచ్చి మొక్కలను నిండా ముంచేసింది. దీంతో లాభం మాట దేవుడెరుగు పెట్టుబడి కూడా రాలేదు. కనీసం ప్రభుత్వమైన మా నష్టాన్ని పూడ్చే విధంగా మాకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

పరిటాల రాంబాబు, కుక్కునూరు

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: అశ్వారావుపేట రోడ్డులో హైస్కూల్ వద్ద వేంచేసియున్న వరసిద్ధి వినాయక ఆలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఆలయంలో గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 2100 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో గన్నమని శ్రీనివాసు, కొమ్మసాని రవీందర్ రెడ్డి, కల్లూరి మురళీకృష్ణ, చల్లా వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా కిట్ల పంపిణీ పూర్తి

టి.నరసాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈవో టి.రామ్మూర్తి తెలిపారు. బుధవారం వివరాలను ఆయన తెలియజేశారు. మండలంలోని మొత్తం 60 పాఠశాలల్లోని విద్యార్థుల్లో 5400 మంది విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశామన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎన్.సురేష్ కుమార్‌రెడ్డి

పోలవరం రూరల్: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎన్.సురేష్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పోలవరం సబ్ డివిజన్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాకు తావు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఉచిత ఇసుక పాలసీలో ఒక్కొక్కరికి 20 టన్నుల పరిమితి మేరకు మాత్రమే ఇసుక పంపిణీ చేస్తారన్నారు. ఇసుకను స్టాక్ పాయింట్ల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా అందిస్తారన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి:

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత యాప్‌లను క్లిక్ చేయరాదన్నారు. అపరిచిత కాల్స్ పట్ల స్పందించొద్దని, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించొద్దని తెలిపారు. బ్యాంకు ఖాతాల వివరాలు తెలిపిన పక్షంలో వెంటనే 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద ముంపులో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో ప్రత్యేక పోలిసింగ్ ఏర్పాటు చేశామని ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ జి.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతుగా నాయకుల నిరసన


నల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో నిర్వహిస్తున్న ధర్నాకు జంగారెడ్డిగూడెం వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెంలో నల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసి, ప్రాణాలు సైతం హరిస్తున్నారని విమర్శించారు. దీనిని అరికట్టాలని, రాష్ట్రంలో శాంతి భద్రతలు కల్పించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో చేస్తున్న ధర్నాకి తాము పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మీడియా కో–ఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న, యువ నాయకులు నేట్రు గణేష్, దోరేపల్లి విజయ్, వీరంకి మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ టీచర్స్ సమస్యలను పరిష్కరించాలి


గిరిజన సంక్షేమశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సతీష్ కోరారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో జేఏసీ నాయకుల బృందం, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతి పత్రం అందించామని చెప్పారు. ఖాళీ డిప్యూటీ వార్డెన్ పోస్టులను భర్తీ చెయ్యాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కరకం శ్రీనివాస్, వెట్టి రమణ, చిర్రి దేవరాజు, సోదెం రాజు, తెల్లం రాములు, సరియం నాగేశ్వరరావు, టీడబ్ల్యూటీయూ నాయకులు కె.వెంకటేశ్వరరావు, నూపా రంగారావు, చోడెం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వేలేరుపాడు: పెద్దవాగు ప్రభావంతో సర్వం కోల్పోయిన కమ్మరిగూడెం గిరిజనులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాటం కృష్ణ స్వరూప్ బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. 240 కుటుంబాలకు రూ.లక్ష విలువ చేసే 15 రకాల నిత్యావసర వస్తువులు, కొవ్వొత్తులు, దోమల క్వాయిల్ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కనుగంటి రేవంత్‌రెడ్డి, ఎస్.కిరణ్, మహేష్, గిరి, శ్రీరాములు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ

కొయ్యలగూడెం: వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సీపీఎం నేతలు ఆరోపించారు. బుధవారం వేలేరుపాడు, కుకునూరు నిర్వాసితులకు కూరగాయలు పంపిణీ చేశారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ విద్య రూపొందిందని, పేద మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏలేటి చిన్నతుక్కయ్య పేర్కొన్నారు. రాజవరం జెడ్పీ హైస్కూల్లో బుధవారం ప్రధానోపాధ్యాయుడు రామారావు అధ్యక్షతన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. 380 మంది విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం గణనీయంగా పెరిగిందని విద్యా వ్యవస్థ పటిష్టానికి తీసుకున్న చర్యలతోనే ఇది సాధ్యమయ్యిందన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఏలేటి రాజు, ఎంపీటీసీ సభ్యులు టి.బ్రహ్మయ్య, విద్యా కమిటీ మెంబర్ కోలా జ్యోతి, కె.రాజేశ్వరరావు, బి.బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితులు, ఆదివాసీలపై దాడులు అరికట్టాలి


దళితులు ఆదివాసీలపై దాడులు అరికట్టాలని నినదిస్తున్న ఇప్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: దళితులు ఆదివాసీలపై దాడులు అరికట్టాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో ×మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం×పై బుధవారం ముప్పిడి అబ్బులు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో కేవీ రమణ మాట్లాడుతూ దళితులు ఆదివాసీలపై లైంగిక దాడులు, హత్యాకాండలు, హక్కుల కాలరాతను వ్యతిరేకిస్తూ ప్రచారం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందన్నారు. దళితులు, ఆదివాసీలు సాధించుకున్న సంక్షేమ చట్టాలు, పథకాలు, హక్కులను ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని, వాటిని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో ప్రమోషన్లలో రిజర్వేషన్ అంశం పైన రాష్ట్ర ప్రభుత్వం దళితుల హక్కులకు భంగం కలిగించే విధంగా విడుదల చేసిన జీవోను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంపల వెంకటేష్, ముప్పిడి అబ్బులు, పాడిదోలు దుర్గారావు, సిరిబత్తుల యేసు, దున్న రాధాకృష్ణ, ముప్పిడి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ రవిచంద్ర హెచ్చరిక


కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని, జరిమానాలతో పాటు శిక్షలు కూడా తప్పవని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీఐ రాజేశ్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలపై బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలతో పాటు రహదారులపై ద్విచక్రవాహనాలను నడుపుతున్న మైనర్ల వద్ద నుంచి 31 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు లేని, నెంబర్ ప్లేట్‌లు లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో డీఎస్పీ రవిచంద్ర మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో ప్రతీరోజూ ఏదో ఒక చోట డ్రైవ్ కొనసాగుతూనే ఉంటుందన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని తెలిపారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం:

గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ అన్నారు. ఎవరైనా వీటి రవాణా, వినియోగంలో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రాఘవాపురంలో డెంగీ మాసోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దశ్యం

చింతలపూడి: డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాఘవాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కిరణ్ చైతన్య పిలుపునిచ్చారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ చైతన్య మాట్లాడుతూ వృథా నీటి నిర్మూలనే దోమల నియంత్రణకు మార్గమని చెప్పారు. వర్షాకాలం ఎక్కువగా టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో బుధవారం పారిశుద్ధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. డ్రెయినేజీలలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని, మురుగును తొలగించారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయరాదన్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

ద్వారకాతిరుమల: అదనపు కట్నం తీసుకు రావాలని ఒక మహిళను వేధిస్తున్న ఆమె భర్త, కుటుంబ సభ్యులపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాళ్లకుంటకు చెందిన పురిటి స్పందనకు తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వణుగూరుకు చెందిన వీరయ్యకు ఇచ్చి ఏడాది క్రితం రెండో వివాహం చేశారు. వివాహ సమయంలో వీరయ్యకు కట్న కానుకలను అధికంగానే ఇచ్చారు. ఇదిలా ఉంటే ఇటీవల పుట్టింటికి వచ్చిన ఆమె తిరిగి భర్త వద్దకు వెళ్లగా అదనపు కట్నం కోసం అత్తింటి వారైన విజయలక్ష్మి, వీర్రాజు, వీరమ్మ, అంబిక, పురిటి అప్పారావు వేధించారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

టి.నరసాపురం: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఒక మహిళపై జూలూరి కరుణ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధాశ్రమానికి సహాయం

జంగారెడ్డిగూడెం: శ్రీ సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి బుధవారం స్నేహజ్యోతి సంస్థ సభ్యులు సహాయాన్ని అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాన నీరు వృద్ధాశ్రమంలోకి చేరడంతో వృద్ధులు ఇబ్బంది పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న స్నేహజ్యోతి సంస్థ వ్యవస్థాపకులు కొల్లేపర ఆనంద్ రూ.13 వేలు, గొడుగులు, దుస్తులు, దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు జయవరపు శేఖర్, సామాజిక వేత్త కేఎల్ఎన్ ధనకుమార్, స్నేహజ్యోతి ప్రతినిధులు ప్రసాద్, గంగాధర్, సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ద్వితీయ ఆరాధన

జంగారెడ్డిగూడెం: ధ్యాన జగత్తు సాధనే లక్ష్యంగా, ధ్యాన అవగాహన, ఆచరణ, వ్యాప్తికి అహర్నిశలు శ్రమించి ఎందరికో ధ్యానమార్గం చూపిన పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ద్వితీయ ఆరాధన జులై 25న నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. 25న గురువారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ పట్టణంలోని శేషాద్రి నగర్ గౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన మందిరంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సామూహిక ధ్యానం, పత్రీజీ జీవిత విశేషాలతో కూడిన దృశ్య శ్రవణ చిత్రమాలిక ప్రసారం ఉంటాయని, కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులతో ఆటలాడిస్తున్న ఉపాధ్యాయులు

లింగపాలెం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలని కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జేవీఆర్ మరియరాజు అన్నారు. ఈ నెల 22 నుంచి 28 వరకు పాఠశాలల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మరియరాజు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తనకు నచ్చిన ఏదో క్రీడలో ప్రావీణ్యం సాధించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించేందుకు సౌకర్యాలు సమకూరుస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి

జంగారెడ్డిగూడెం: గ్రంథాలయ ఉద్యమకారులు, గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతిని చత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ వెంకట రమణయ్య 1911లో విజయవాడ రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డారన్నారు. 1914లో విజయవాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార, ప్రతినిధులతో గ్రంథాలయ మహా సభలను నిర్వహించారని తెలిపారు. భారత దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘం, 1915లో గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను స్థాపించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్, ఇన్‌ఛార్జ్ లైబ్రేరియన్ మధుబాబు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

బుట్టాయగూడెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక గిరిజన మహిళ కిందపడి తీవ్ర గాయాల పాలయ్యింది. మండలంలోని కాపవరానికి చెందిన పొడియం రామలక్ష్మి అనే గిరిజన మహిళను కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనంపై బుట్టాయగూడెం వస్తుండగా శివాలయం సమీపంలో వెళ్తున్న వాహనంపై నుంచి కింద పడింది. దీంతో ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు.

వర్జీనియా రైతుల హర్షం

జంగారెడ్డిగూడెం: ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అదనపు పంటను విక్రయించుకునేందుకు కేంద్ర వాణిజ్య శాఖ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై వర్జీనియా రైతు సంఘం అధ్యక్షుడు పరిమితి రాంబాబు, సత్రం వెంకట్రావులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిచౌంగ్ తుఫాను కారణంగా గత ఏడాది వర్జీనియా రైతులు పంట నష్టపోయారన్నారు. అయినప్పటికీ రెండోసారి పంట వేసి నాణ్యమైన పొగాకును పండించారని, ఈ క్రమంలో వర్జీనియా పంట అధికంగా పండిందన్నారు. రెండు సార్లు పంట వేయడంతో పెట్టుబడులు కూడా అధికమయ్యాయన్నారు. అమ్మకపు ఉత్తర్వులపై సంతకం చేసిన కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్, బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కు వర్జీనియా రైతు సంఘాల నాయకులు, రైతులు ధన్యవాదాలు తెలిపారు.